# 8

# ప్రభువైన యేసు ఈ లోకమునకు ఎందుకు వచ్చాడు?

*“చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమపరచితిని” (యోహాను 17:4).*

నగరంలో నువ్వు రోడ్డు పక్కన నడుస్తున్నప్పుడు ఒక విలేఖరి వచ్చి, “లోకారంభము మొదలుకొని సంభవించిన అతి గొప్ప సంఘటన ఏది?” అని నిన్ను అడిగినట్లయితే, నీవు అతనికి ఏమి చెప్తావు? నీవు అతనికి ఎలా బదులిస్తావు? మానవ చరిత్రలో జరిగిన సంఘటనలన్నిటికన్నా ఏ సంఘటన ఘనమైనది? అన్నదాన్ని గురించి నీవు కొంతసేపు ఆలోచించిన మీదట, ప్రభువైన యేసు లోక రక్షకుడుగా ఈ లోకానికి అరుదెంచాడనేది నీ జవాబైయుంటుంది. మనలో ప్రతి ఒక్కరు ఆయా పదాలు ఉపయోగించినా, మన పాపముల కొరకు యేసు మరణించడానికి అవతరించాడనడం మన జవాబుకు కేంద్రంగా ఉంటుంది.

ఈ లోక చరిత్రలో దేవుని కుమారుడైన యేసు యొక్క నరావతారం, అంటే ఆయన సశరీరుడై ప్రత్యక్షంగా జీవించాడనేది మహా ఘనమైన సంఘటన. యేసు దేవుని స్వరూపము కలిగినవాడై ఉండియు, ఆయనతో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని ఆయన ఎంచుకొనలేదని పౌలు వ్రాశాడు. (ఫిలిప్పీ. 2:6, 7) “ఆయన తన్ను తాను కాళీ చేసికొని, మనుష్య పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకున్నాడు”. యోహాను ప్రకారం, “ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి” (యోహాను 1:14).

ఆయన దేవుడు కాకపోయినా ఎంతగా మానవుడైయున్నాడో, ఆయన మానవుడు కాకపోయినా అంతగా దేవుడైయున్నాడని మనం చెప్పవచ్చు. గనుక ఆయన నర జాతిలో నరునివలెనే జన్మించాడు (లూకా 2:6), నరులు పెరిగినట్టే ఆయన కూడా పెరిగాడు

(లూకా 2:40), నరులు ఎలాటి బాధలననుభవించారో ఆయన కూడా అలాటి బాధలే అనుభవించాడు (హెబ్రీ. 5:8, 9). వ్యాధి, క్షీణత, మరియు మరణానికిలోనగు మానవ శరీరంలో ఆయన జీవించి, సిలువపై ఆయన చంపివేయబడ్డాడు కూడా (ఫిలిప్పీ. 2:8, 9). ఆయన పరిపూర్ణంగా నరుడై జీవించాడు గనుక ఆయన మనుష్య కుమారుడనబడ్డాడు; అయినా ఆయన పరిపూర్ణంగా దేవుడైయున్నాడు, గనుక ఆయన దేవుని కుమారుడనబడ్డాడు (హెబ్రీ. 2:14, 17, 18). ఆయన ఒకే వ్యక్తిత్వంలో పరిపూర్ణమైన దైవ మానవుల కలయికయై ఉన్నాడు. ఆయన మనవంటివాడైనా, ఆయన దైవంగానే నిలిచియున్నాడు.

క్రీస్తు భూలోకానికి అరుదెంచడంలోనున్న పరిస్థితి అతి ప్రాముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది: ఆయన అవతరించిన తీరులో క్రీస్తు ఎందుకు ఈ లోకానికి అరుదెంచాడు? మానవ జాతిలో ఆయన ప్రవేశించి, మన మధ్య నివసించి, సిలువపై మరణించడంలో ఉన్న ఉద్దేశమేమి? దేవుని దైవికమైన కుమారుడు పూర్ణంగా మానవుడుగా తగ్గించుకున్నది ఎందులకు? ఈ ప్రశ్నలన్నిటికి జవాబు ఒకే ప్రతిపాదనలో సంక్షిప్తం చేయవచ్చు: తన పరిచర్య, మరణము, పునరుత్థానములనే వాటిచేత – "ఆయన తన సంఘమని పిలిచే ఒక ప్రజను తన నామము నిమిత్తం బయటికి పిలువవచ్చాడు."

మరో విధంగా చెప్పాలంటే, ఆయన ఈ లోకాన్ని సందర్శించిన దానికి ప్రతిఫలం సంఘమే. ప్రభువైన యేసు ఒక గ్రంథం వ్రాయలేదు, కళాశాలను స్థాపించలేదు, భౌతికమైన ఒక కుటుంబాన్ని ఆయన కట్టలేదు. తన భాగ్యంలోనుండి ఆస్తిని దానముగా యిచ్చు ఒక మూలధనాన్ని దాచియుంచలేదు. భూ సంబంధమైన తన పరిచర్యవలన ఉత్పత్తి చేసిన ప్రత్యక్షమైన వాస్తవం సంఘమే. "సంఘము" అని ఆయన పిలిచిన ఆత్మ సంబంధమైన ఒకే శరీరాన్ని మాత్రమే ఆయన కడతాడని చెప్పాడు (మత్తయి 16:18). తన పరిచర్య కాలంలో ఆయన వేసిన ఒకే పునాది సంఘపు పునాది. గనుక సంఘం, క్రీస్తు భూలోక నిర్మాణ కార్యాలలో ఏకైక సృష్టి అని చెప్పవచ్చు.

## సువార్త రచనలచే స్థిరపరచబడింది

ఈ సత్యము సువార్త రచనలచే బలంగా స్థిరపరచబడింది. సువార్త రచనలలో ప్రతి ఒక్కటి పరలోక రాజ్యము లేక సంఘం అనేదాన్ని సూచిస్తూ దానివైపు నడిపిస్తోంది. తన మరణం, పునరుత్థానానంతరం వచ్చే మొదటి పెంతెకొస్తు దినాన ప్రభువు దానిని స్థాపిస్తాడని అది సూచిస్తోంది.

సువార్త రచనల్లో క్రీస్తు ప్రభువు యొక్క జీవితాన్ని ఒకడు చదువుతూ ఉండగా, ఆయన పరిచర్యను గూర్చిన మూడు అంశాలు కదలివచ్చి అతనిని హత్తుకుంటాయి: (1) అతడు సాధింపవచ్చిన పని, (2) అతని పనికున్న సిద్ధపాటు స్వభావం, మరియు (3) అతని పరిచర్య యొక్క అసంపూర్ణ స్వభావం.

**మొదటిగా, అతని వ్యక్తిగతమైన పరిచర్య కాలంలో లోకమంతటికి సువార్త ప్రకటించాలన్న దృష్టితో ఆయన ఆరంభించినట్టు సువార్త రచనలు సూచింపవు.** ఆయన తన శిష్యులను ఏర్పరచుకొన్న తరువాత, లోక వ్యాప్తంగా సువార్త ప్రకటించాలనే ఆదేశాన్ని

ఆయన వారికివ్వలేదు. వారి అత్యాసక్తిని ఆయన నిమ్మళింపజేసి, "–మీరు అన్యజనుల దారిలోనికి వెళ్లకుడి, సమరయుల యే పట్టణములలోనైనను ప్రవేశింపకుడి గాని ఇశ్రాయేలు వంశములోని నశించిన గొఱ్ఱెల యొద్దకే వెళ్లుడని" తన అపొస్తలులకు ఆదేశించాడు (మత్తయి 10:5, 6). మనకు ఆశ్చర్యము కలుగునట్లు, పాలస్తీనాకే ప్రభువైన యేసు తన్ను తాను పరిమితి చేసికొన్నాడు. రోమా ప్రపంచంలో విస్తరించియున్న యితర దేశాలకు ఆయన ఎన్నడును వెళ్లలేదు. లోకంలోని బహు చిన్న ప్రాంతంలో తన ఉపదేశానికి, ప్రకటనకు సంబంధించిన పని ఆయన నెరవేర్చాలనుకున్నాడు. తన వ్యక్తిగతమైన పరిచర్య కాలంలో ప్రభువైన యేసు లోకమంతటికి సువార్త ప్రకటింప బూనుకొని ఉన్నట్టయితే, లోక వ్యాప్తికి సంబంధించిన పన్నాగాలు, పద్ధతులను వినియోగించి, ఆయన మరి ఒక విధానంలో దాన్ని జరిగించి ఉండేవాడే.

**రెండవదిగా, రానున్న ఒకానొకదానికి సిద్ధపాటుగా ప్రభువైన యేసు జీవితం ఆయన పని, మరణం అనేవి ఉండినట్టు సువార్త రచనలు సూచిస్తున్నాయి.** "అప్పటినుండి యేసు – పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలు పెట్టెను" (మత్తయి 4:17). కొండమీద ప్రసంగంలో, "నీ రాజ్యము వచ్చుగాక" అని ప్రార్థించునట్టు ఆయన బోధించాడు (మత్తయి 6:10). ఆయన అద్భుతాలను చూచి జనులు పరవశులై పోకుండునట్టు ప్రభువు భద్రత వహించాడు. భూ సంబంధమైన రాజుగా చేయాలనే వారి ప్రతిచర్యను ఆయన నిరాకరించాడు. తన కార్యక్రమాన్ని జన సమూహాలు తనకు ఆదేశించకుండునట్లు ఆయన జాగ్రత్త వహించాడు. ఆయన అద్భుతాలు చేసినప్పుడు ఎవరికి ఉపకారం కలిగిందో వారు యితరులకు దాని గూర్చి చెప్పవద్దని కొన్ని సార్లు ప్రభువు ఆజ్ఞాపించాడు (మత్తయి 8:4).[1] ఆయన తన పండ్రెండు మంది అపొస్తలులను స్వయంగా తర్ఫీదు చేశాడు. తాను వెళ్లిపోయిన తరువాత జరిగించవలసిన పని కొరకు ఆయన వారిని తర్ఫీదు చేసినట్టున్నాడు (యోహాను 14:19).

**మూడవది, ప్రభువైన యేసు యొక్క పరిచర్యను గూర్చి అసంపూర్ణ భావనను అది కలిగియున్నట్టు సువార్త రచనలు చిత్రిస్తాయి.** తండ్రి తన్ను ఏమి జరిగించడానికి పంపాడో దానిని ప్రభువు జరిగించాడు. అయితే తన జీవితపు చివరి భాగంలో, తన ఆరోహణం – తరువాత వెంటాడనున్న యితర ప్రత్యక్షతలు, సంభవాలు వగైరాల కొరకు ఆయన పన్నిద్దరిని సిద్ధపరచాడు. ప్రభువైన యేసు తన అపొస్తలులకు యిలా తెలిపాడు: "ఆదరణ కర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). ఆయన యింకా వారితో యిలా అన్నాడు: "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన **ఆత్మ** వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13). పునరుత్థానుడైన తరువాత ఆరోహణమునకు ముందుగా, పైనుండి శక్తి పొందువరకు యెరూషలేములో నిలిచియుండవలెనని ప్రభువు తన అపొస్తలులకు ఆజ్ఞాపించాడు. శక్తి పొందిన తోడనే, యెరూషలేము మొదలుకొని సకల జనములలో మారుమనస్సును పాపక్షమాపణయు వారు ప్రకటింప వలసినవారై

ఉన్నారు (లూకా 24:46-49).

ఆయన మరణానికి ముందును వెనుకను ప్రభువు పరిచర్య యొక్క గుణగణాలు ఒక విషయాన్ని స్థిరంగా నమ్మేలా తెలుపుతున్నాయి. అదేమంటే, భూనివాస కాలంలోని ఆయన పరిచర్య సంఘ రాజ్యమును స్థాపించడానికి అవసరమైన వాటినన్నిటిని ఏకముగా సమకూర్చడమే. భూమిమీద తన పని భారాన్ని మత్తయి 16:18లో యేసు తన శిష్యులకు యిలా ప్రకటించాడు: "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోకద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను." **ఈ విధంగా సువార్త ప్రకటించాలనే ఉద్దేశంతో ప్రభువైన యేసు అవతరించలేదు; ప్రకటించవలసిన సువార్త ఉండేలా ఆయన వచ్చియున్నాడు.**

దక్షిణపు కోటలో మౌంట్ రష్మోరును చెక్కిన ఖ్యాతిగల గుట్‌జోన్ బర్గ్లమ్ వాషింగ్‌టన్ డి. సి. లోని స్టేట్ హౌస్ కొరకు అబ్రాహాము లింకన్ తలను చెక్కాడు. తన స్టుడియోలోని పాలరాయి ముక్కలోనుండి అతడు దాన్ని చెక్కాడు. తన స్టుడియోను శుభ్రంచేసే స్త్రీ లోపలికి వచ్చి తొలిసారిగా జీవం ఉట్టిపడే ఆ శిల్పాన్ని చూచినప్పుడు, "ఈ రాతి ముక్కలో లింకన్ బంధింపబడి ఉన్నాడని యితనికెలా తెలుసు" అని ఆశ్చర్యంగా పలికింది. యితరులు చూడలేని దానిని బర్గ్లమ్ చూడగలడనేదే దానికి జవాబు. అతనికి కళాకారుని కన్నుంది, శిల్పి యొక్క భావన ఉంది. నైపుణ్యంగల అతని చేతులు దివ్య దృష్టిగల అతని మనుస్సు రాతి ముక్కలో ముఖాన్ని వెలికి తీయకముందే దాన్ని కనుగొనగలడు.

సువార్త రచనల సహాయంతో, తన భూ నివాసపు పరిచర్య కాలంలో ప్రభువైన యేసు ఏమి వీక్షించాడో దానిని మనం తిలకించగలం. తన పరిచర్యలో – రాబోతున్న రాజ్యము యొక్క దివ్య దృష్టి, సిద్ధపాటు అనేవే దాగి ఉన్నాయి. ఆయన దాన్ని గూర్చి ప్రకటించాడు, దాని కొరకు సిద్ధపడ్డాడు, తన రక్తంతో దాన్ని కొన్నాడు.

## అపొస్తలుల కార్యములచే స్థిరపరచబడింది

ప్రభువైన యేసు యొక్క పరిచర్య, మరణం, పునరుత్థానాల వెనుక సంఘాన్ని సృష్టించాలి, రాజ్యాన్ని తేవాలి అనే అధికార పూర్వకమైన ఉద్దేశం ఉంది. సువార్త రచనలు సత్యాన్ని నిష్కపటంగా ప్రకటించాయి, సజీవమైన – వర్ణముల ఉదాహరణలతో అపొస్తలుల కార్యములు ఆ ప్రకటనను స్థిరపరచుతున్నాయి.

ప్రభువైన యేసు ఆరోహణమైన పది దినాలకు, పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ అపొస్తలులకు అద్భుతరీతిగా అనుగ్రహింపబడ్డాడు (అపొ. 2:1-4). ప్రభువైన యేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానాలతో కూడిన సువార్త తొలిసారిగా ప్రకటింప బడింది. విశ్వాసము, మారుమనస్సు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మం అనేవాటితో సువార్తకు లోబడునట్లు జనులు ఆహ్వానింపబడ్డారు (అపొ. 2:38; లూకా 24:46, 47); ప్రకటింపబడిన సందేశాన్ని అంగీకరించిన మూడువేల మంది బాప్తిస్మం పొందడం జరిగింది (అపొ. 2:41). గనుక, ప్రభువు యొక్క పరిచర్యతో, రాత్రి వెంట పగలు

వచ్చినట్టు, ప్రభువు సంఘం జన్మించింది.

అపొస్తలుల కార్యములలోని మిగిలిన కథ – పవిత్రమైన ప్రేమాజ్వాలగా, యెరూషలేమునుండి యూదయ, సమరయ, రోమా సామ్రాజ్యంలోని యితర ప్రాంతాలకు సంఘము కదలిపోయిన కథయే. అపొస్తలుల కార్యాలలో దైవ ప్రేరేపితమైన సువార్త ప్రకటన ఎప్పుడు తటస్థించినా, శ్రోతలు ప్రతిచర్యను కనుపరచారు, వాక్యానికి లోబడడంవలన సంఘంలోనికి ప్రవేశించారు. అపొస్తలుల కార్యాలలో సువార్త పర్యటన ఎప్పుడు జరిగినా, లోకంలోని నూతన ప్రాంతాలలో స్థానిక సంఘాలు ప్రారంభించ బడ్డాయి. పౌలు యొక్క మూడు సువార్త ప్రయాణాలలో యెరూషలేమునుండి ఇల్లూరికు ప్రాంతంవరకు స్థానిక సంఘాలు లోకవ్యాప్తంగా నాటబడ్డాయి (రోమా 15:19). క్రీస్తు ఈ జగతికేతెంచిన దాని ప్రతిఫలం, సంఘ స్థాపనయే అనే నిర్ణయానికి నడిపింపబడకుండ అపొస్తలుల కార్యాలను చదివినవాడెవడు ఉండడు.

---

**ప్రభువైన యేసు సువార్త ప్రకటింప రాలేదు;**
**ప్రకటింపబడు సువార్త ఉండునట్లుగా**
**ఆయన అరుదెంచాడు.**

---

"లోకాన్ని సువార్తతో నింపే పనిలో యేసు ఉపయోగించిన పద్ధతులనే మనం ఉపయోగించాలి. భవిష్యత్తులో ఆ పనికి మనచుట్టు పన్నెండు మందిని చేర్చి వారికి తర్ఫీదునిద్దాం. ఆయన వినియోగించిన పద్ధతిలో లోకమంతటిలో సువార్త ఎలా ప్రకటించాలో ప్రభువు చూపించాడు" అని ఒక సువార్తికుడు చెప్పగా నేను విన్నాను. తాను చేసిన ప్రతిదానిలో యేసు నిశ్చయముగా పరిపూర్ణుడైయున్నాడు. ఏదియెలాగున్నా, ఆయన పరిచర్యను గూర్చి సవిస్తరంగా మనం పఠించినట్టయితే, లోకవ్యాప్తంగా సువార్తను ప్రకటించడం ఆయన పని కాదని మనకు తెలుస్తోంది. సంఘానికి పునాది వేయడమే; లోకవ్యాప్తంగా సువార్త ప్రకటించడానికి తన నమూనాలోనున్న వివిధ భాగాలను ఏకంగా సమకూర్చడమే ఆయన చేసిన పనియై ఉంది. ప్రత్యేకింపబడిన తన పనిని నెరవేర్చు కొనడానికి అనుకూలమైన పద్ధతులను ఆయన వినియోగించుకున్నాడు. ఆయన మన కనుగ్రహించిన లోకవ్యాప్త సువార్త పనికి భిన్నమైన పనిని ఆయన జరిగించాడు.

తదనుసారంగా, అపొస్తలులుగాని దైవ ప్రేరేపితులైన యితర మనుష్యులు గాని ప్రభువు ఉపయోగించిన పద్ధతులను అనుసరించినట్టు అపొస్తలుల కార్య గ్రంథంలో మనం చూడము. ప్రభువు చేసినట్టుగా, ఆయన పద్ధతిని వినియోగించుతూ, పంట్రెండు మందిని వారు తమచుట్టు పోగుచేసికోలేదు. అపొస్తలులును, దైవ ప్రేరేపితులగు యితర మనుష్యులును, వారి ఉపదేశమువలనను బోధవలనను జనులను సంఘంలోనికి తెచ్చారు. నూతనంగా క్రైస్తవులైనవారు పెంచబడి, తర్ఫీదు చేయబడి, ప్రోత్సహింపబడి, సేవకును సువార్త ప్రకటనకును సంఘంచే సంఘం యొక్క భాగంగా నేర్పించబడ్డారు. ప్రభువైన యేసు యొక్క భూసంబంధమైన పరిచర్యకు ఫలితంగా సంఘం యొక్క జీవితం ఉత్పన్నమై

యున్నట్టు అపొస్తలుల కార్య గ్రంథం చూపుతోంది. క్రొత్త నిబంధనలో 48 శాతం క్రీస్తు యొక్క జీవితాన్ని సూచిస్తుంది. మిగిలిన 52 శాతం క్రీస్తు జీవితం, మరణం, పునరుత్థానాలు ఉత్పన్నం చేసిన – సంఘంతో కూడి ఉంది.

## పత్రికలచే పునః స్థాపింపబడింది

క్రీస్తు యొక్క భూనివాస కాలపు జీవితము, మరణాల సహజమైన ప్రతిఫలమే సంఘము అనే సత్యాన్ని క్రొత్త నిబంధన పత్రికలు ఒత్తి పలికి, వర్తింపజేస్తున్నాయి. సువార్త రచనలు సత్యాన్ని దృఢపరచుతున్నాయి. అపొస్తలుల కార్యాలు దాన్ని విస్తరింపజేస్తుంది, మరియు పత్రికలు దానిని వర్తింపజేస్తుంది. ఆత్మ సంబంధమైన శరీరంతో నిలిచి ఉన్న క్రీస్తు ప్రభువు జీవితానికి ఎలా ప్రత్యుత్తరమివ్వాలో చూపుతున్నాయి.

విశ్వాసము విధేయతలవలన క్రీస్తులోనికి వచ్చిన ప్రజలకు పత్రికలు వ్రాయబడ్డాయి. క్రీస్తు జీవితం, మరణం మరియు పునరుత్థానాలు సరికొత్త కేంద్రంగా ప్రభావితమైయున్న కాలంలో వారు జీవించారు. దైవ ప్రేరేపితులైన మనుష్యుల యొక్క సందేశ సారము క్రీస్తు ప్రభువుగా ఘనపరచబడ్డాడని, మన మధ్య ఆయన నివసించడాన్ని ఆయన సంఘముగా రూపొంది నిలిచియుండడం ద్వారానే సరిగా స్వీకరించడమౌతుంది.

క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన శరీరంగా జీవించుతూ సేవ చేస్తూ ఉండాలని ప్రతి పత్రికలోను క్రీస్తు యొక్క అనుచరులు కోరబడ్డారు. పత్రికలన్నీ ఏకంగా సమకూర్చ బడినప్పుడు, “అది మార్గదర్శకమైన చిన్న పుస్తకమై”యుంటుంది. అన్ని రకాలైన పరిస్థితులలోను ఆయా స్థలములలోను క్రీస్తు సంఘంగా ఎలా ఉండాలి, ఎలా జీవించాలనే విషయాన్ని అవి చూపుతాయి. క్రీస్తు యొక్క భూ నివాస కాలపు పరిచర్య మనకు ఎలా వర్తిస్తుందో అవి మనకు ఉపదేశం చేస్తాయి.

**విధేయతతో కూడిన విశ్వాసంతో ఆయన శరీరంలోనికి ప్రవేశించడంవలన యేసు ప్రభువుగా మనం ఆయనకు లోబరచుకుంటాం.** విశ్వాసం యొక్క చివరి జవాబు క్రీస్తును ధరించుకొనడంతో పౌలు పోల్చాడు (గలతీ. 3:27). పత్రికల ప్రకారం, రక్షణ కొరకు బాప్తిస్మం పొందడం ద్వారా ఆయన శరీరంలో ప్రవేశించేవరకు, ఎవడును ప్రభువైన యేసుకు లోబడినవాడు కాడు. దీనికి ముందు విశ్వాసము, మారుమనస్సు, యేసును దేవుని కుమారుడుగా ఒప్పుకొనడం అనేవి జరిగి తీరాలి.

**సంఘమనే ఆత్మ సంబంధమైన అతని శరీరంలో దేవుని కుటుంబంగా కూడి ఆరాధించుతూ జీవించడంవలన ప్రభువైన యేసు యొక్క జీవితం, మరణం, పునరుత్థానాలనే వాటిని మనం ఘనపరచుతాం.** పౌలు యిలా అన్నాడు:

> ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరు ఏకముగా ఉన్నారు (గలతీ. 3:28).

> ఒక్క శరీరములో మనకు అనేక అవయవములుండినను, ఈ అవయవము లన్నిటికి ఒక్కటే పని యేలాగు ఉండదో, ఆలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము (రోమా 12:4, 5).

> ... కాగా ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవములన్నియు దానితోకూడ శ్రమపడును; ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవములన్నియు దానితో కూడ సంతోషించును. అటువలె, మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు (1 కొరింథీ. 12:26, 27).

> ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు, పౌలు మరునాడు వెళ్లనైయుండి, వారితో ప్రసంగించుచు ... (అపొ. 20:7).

దేవుని కుటుంబముగా, క్రీస్తు సంఘముగా జీవించుతూ దేవుని ఆరాధించకుండ తప్పి పోయినట్లయితే, క్రీస్తు ఏమి సాధించడానికి అవతరించాడో దానినుండి మనం తొలిగిపోయినవారమై, దేనిని స్థాపించడానికి ఆయన మృతినొందాడో దానిని పాడు చేసినవారమౌతాం.

**తన శరీరమైన సంఘమై ఉండడానికే గాని అంతకు మించి ఉండడానికి క్రీస్తు ప్రభువు మనలను పిలువలేదు.** తన ప్రజలు క్రీస్తు శరీరమైయుండడమే తప్ప మరి ఏదైయున్నట్టును పత్రికలు ఎన్నడూ వర్ణించలేదు. పత్రికల ప్రకారం, తన్ను వెంబడించ డానికి ప్రభువైన యేసు ఒకే ఒక మార్గాన్ని, ఆయన్ను సేవించడానికి ఒకే ఒక మార్గాన్ని, తాను సంపాదించిన రక్షణను మరియు ఆయన రక్తాన్ని పొందడానికి ఒకే ఒక మార్గాన్ని సృజించాడు. ఆత్మ సంబంధమైన తన శరీరంగా ఈ లోకమందు నమ్మకంగా జీవించడ మనేదే ఆ శక్తిగల మార్గమైయుంది.

ఒక చిన్న పిల్ల యింటి మూలన ఒక బైబిలును కనుగొంది. దాన్ని చేత పట్టుకొని, ఆ చిన్నారి తన తల్లిని యిలా అడిగింది: "అమ్మా యిదేమి పుస్తకం?" "అది దేవుని గ్రంథం, బైబిలు" అని ఆమె తల్లి జవాబిచ్చింది. "మనం ఎన్నడూ దాన్ని ఉపయోగించం గనుక ఎందుకు తిరిగి దానిని ఆయనకు పంపము?" అని ఆ చిన్నారి మరల అడిగింది. ఆమె ప్రశ్న అంతరంగాన్ని నమిలేస్తుంది.

వాస్తవమేమంటే, మనం దాన్ని చదవవచ్చుగాని, ఎన్నడూ దాన్ని మనం ఉపయోగించకపోవచ్చు కూడా. ప్రతి సంభాషణలో మనం బైబిల్ కోట్ చేయవచ్చు, అనుదినం దాన్ని చదువవచ్చు, అయినా దాన్ని వర్తింపజేసికోలేకపోవచ్చు. క్రీస్తు సంఘంగా మన జీవిత ఆచరణలో జీవించడమే అధికారపూర్వకంగా బైబిలును వర్తింపజేసి కొనడం ఔతుంది. రూపొందాలని బైబిలు మనకు బోధించినట్టు రూపొందినప్పుడు మాత్రమే మనం దానిని సరిగా ఉపయోగించుకున్నవారమై ఉంటాం.

## ముగింపు

గనుక నరరూపు దాల్చడంలో క్రీస్తు యొక్క పని ఆత్మ సంబంధమైన తన శరీరమైన సంఘాన్ని సృజించుకొనడమనేదే అని క్రొత్త నిబంధన మొత్తంగా బోధిస్తుంది. అందులో వాగ్దానం చేయడాన్ని బట్టి సువార్త రచనలు దాన్ని స్థాపిస్తున్నాయి. దాన్ని బోధించడంచేత అపొస్తలుల కార్యాలు దాన్ని చిత్రిస్తున్నాయి. జీవిత దినచర్యలో వర్తింపజేయడాన్ని బట్టి పత్రికలు దాన్ని తిరిగి స్థాపిస్తున్నాయి.

జీవించి, మృతినొంది, మన రక్షణకై తిరిగి లేచినవానికి మనమిచ్చే ప్రత్యుత్తరానికి ఒకే ఒక మార్గం ఆయన సంఘంలో ప్రవేశించి, దానిలో నమ్మకమైన అవయవములుగా జీవించడమేనని క్రొత్త నిబంధన బోధిస్తున్నందున, యిలాటి ప్రశ్న ఒకటి తల ఎత్తుతోంది: "ఆయన శరీరంగా నీవు జీవిస్తున్నావా?" జీవితాంతానికి చేరుకున్న తరువాత, జీవితం యొక్క అసలైన ఉద్దేశాన్ని విస్మరించినట్టు కనుగొనడం ఎంత తప్పైయుంటుంది! దీని కంటెను దుఃఖం కలిగించేది – దేవుని కుమారుడు ఈ జగత్తుకు అరుదెంచిన ఉద్దేశాన్ని అందుకోలేకపోవడమై ఉండవచ్చు. దేవుని యొక్క దైవికమైన రక్షణ సందేశాన్ని క్రొత్త నిబంధన ఎంత నిశ్చయముగా యిచ్చిందో, నరరూపు దాల్చి ఎంత నిశ్చయంగా క్రీస్తు లోకానికరుదెంచాడో, ఆయన శరీరంలో ప్రవేశించనివాడు అంత నిశ్చయంగా వాటి ఉపకారాలను పొందకుండ ఉండిపోతాడు. తన జీవితాంతం క్రీస్తు ఈ లోకానికి వచ్చిన కారణాన్ని గ్రహించలేదని నేర్చుకుంటాడు. **క్రొత్త నిబంధన మొత్తంలోని ప్రాథమిక తీర్మానం యిదై ఉంటుంది!**

ఇక్కడ ఆయన క్లుప్త జీవితం ముగింపునకు వచ్చి చేరుకున్నప్పుడు, "తండ్రీ, చేయుటకు నీవు నాకు అప్పగించిన పనిని నేను చేశాను. నా కొరకు విధింపబడిన నీ పనిని నేను నెరవేర్చానని" ఆయన చెప్పగలడు. దేవుని చిత్తం యొక్క పరిధిలో, ఆయన ఉద్దేశాలను నెరవేర్చుతూ, భూమిమీద కొద్ది సంవత్సరాలు జీవించడం దీర్ఘకాలం రాజ భవనంలో నివసిస్తూ స్వార్థపరమైన కోర్కెలతో రాజ్య పాలన చేసే దానికంటె శ్రేష్ఠం. జీవితం యొక్క అంతమందు అనేకమంది యిలా చెప్పగలరు: "దేవా, నీవు భూమిమీద జీవించడానికి ప్రస్తావించిన సంవత్సరాలలో నేను చేయగోరిందే చేయగలిగాను. నా కొరకు ఏర్పరచుకున్న నా పనినే నేను అనుసరించాను."

మన జీవిత అంతానికి చేరుకున్నప్పుడు, అద్భుతమైన రీతిలో మనం యిలా చెప్పవచ్చు: "ప్రభువా, నేనేమైయుండాలో ఏమి జరిగించాలో నీ లేఖనాలలోనుండి నేను కనుగొన్నాను. ఆ పనిని జరిగించడానికే నన్ను నేను అప్పగించుకున్నాను. భూమిమీద నిన్ను మహిమపరచడానికి నిష్కపటంగా ప్రయత్నించాను. నీవు నాకు అనుగ్రహించిన విధానంగా జీవించడానికి కృషి చేశాను. నేను క్రీస్తు సంఘంగా జీవించాను" (ఇట్టిది నిజంగా ధన్య జీవితమే).

## పఠనము మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. ప్రపంచ చరిత్రలో ఎన్నడు జరగనంత మహా ఘనమైన సంభవం ఏది? నీ జవాబుకు కారణాలను తెలుపుము.
2. యేసు సంపూర్ణంగా నరుడా లేక కేవలం పాక్షికంగానే నరుడా?
3. యేసు సంపూర్తిగా దైవమా లేక కేవలం పాక్షికంగానే దైవమా?
4. యేసు లోకమునకు ఎందుకు అరుదెంచినట్టు? ఆయన నెరవేర్చడానికి వచ్చిన ఒక ఉద్దేశమేమి?
5. ప్రభువైన యేసు యొక్క పరిచర్య అసంపూర్ణమైన స్వభావం కలిగియున్నదా?

6. తన పరిచర్య కాలంలో లోకమంతా సువార్త చేయాలని ప్రభువు ప్రయత్నించాడా?
7. రానున్న ఒకానొక దాని కొరకు ప్రభువు యొక్క పరిచర్య ఎలా సిద్ధపాటుగా ఉన్నదో చూపుము.
8. ప్రభువు ఉపయోగించిన పద్ధతులనే నేడు మనము ఉపయోగించవలెనా? ఎందుకు లేక ఎందుకు కాదో నీ కారణములనిమ్ము.
9. క్రొత్త నిబంధనలోని పత్రికల పని ఏమి?
10. ప్రభువు యొక్క భూ సంబంధమైన పరిచర్యకు మనం ఎలా ప్రతిస్పందన చేయాలి?
11. ఆయన సంఘంగా ఉండకుండ ప్రభువు జీవితానికి మనం తగినట్లు ప్రతిస్పందన చేయగలమా?
12. ఆయన సంఘంలో జీవించకుండ ఈ లోకమందు మన కొరకున్న ప్రభువు యొక్క పనిని మనం నెరవేర్చగలమా?

---

సూచనలు

[1]మత్తయి 9:30; 12:16; 17:9; మార్కు 1:44; 3:12; 5:43; 7:36; 8:30; 9:9; లూకా 4:41; 8:56; 9:21లను కూడా చూడు. “ఎవరితోను చెప్పకుడి” అనే వింతైన ఆజ్ఞను గూర్చి J. W. McGarvey యిలా వ్రాశాడు: సైనిక అధికారులు జోక్యం పుచ్చుకొనునంతగా జనులు ఉల్లాస భరితులు కాకుండ అది అవసరమైయున్నట్టు లెక్కించబడింది. ప్రభువైన యేసు యొక్క బోధ విషయంలో జనులను మౌన వైఖరి అనుసరించేలా చేయడం సాధ్యమయ్యేది కాదు (మార్కు 1:45తో పోల్చి చూడు). “కొన్ని సార్లు, అవసరమైనప్పుడు, ఆయన తన గమనాన్ని వెనుకకు త్రిప్పి, ఆయన వారికి చేసినవాటిని గూర్చి తెలియజెప్పుడని ఆజ్ఞాపించాడు” (J. W. McGarvey, *The New Testament Commentary: Matthew and Mark* [N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.], 75).